# సద్గురు బోధలో జగద్గురు గీత

## సర్వం శ్రీసాయి సేవా ట్రస్ట్

Regd. 192/2019



## సద్గురు బోధలో జగద్గురు గీత

ఐదవ అధ్యాయం

సాయి సచ్చరిత్ర అయిదవ అధ్యాయం ప్రారంభంలో మన బాబా పెండ్లివారితో కలిసి షిర్డీ రావడం చూస్తాము. ఆ క్రమంలో దారివెంట పోతున్న చాంద్ పాటిల్ పోగొట్టుకున్న గుఱ్ఱం ఎక్కడుందో తెలపడం చూస్తాము. ఇది బాబా వారి సర్వజ్ఞత్వంకు నిదర్శనం అని చెప్పనక్కర్లేదు. ఈ విషయంలో గీతలో భగవానుడు చెప్పింది చూద్దాం.

సర్వస్య చాహం హృది సన్నివిష్టో
మత్తః స్మృతిర్ జ్ఞానమపోహనం చ ।
వేదైశ్చ సర్వైరహమేవ వేద్యో
వేదాంతకృద్వేదవిదేవ చాహమ్ ॥ గీత 15 -15 ॥

నేను సమస్త ప్రాణుల హృదయములలో స్థితమై ఉన్నాను, నా నుండే జ్ఞాపకశక్తి, జ్ఞానము, మరియు విస్మృతి (మర్చిపోవుట) కలుగుతాయి. అన్ని వేదముల ద్వారా తెలుసుకోబడవలసిన వాడను నేను మాత్రమే, వేదాంత రచయితను నేనే, మరియు వేదార్ధమును తెలిసినవాడను నేనే.

మనకు తెలిసి భగవంతుడు తాను సర్వాంతర్యామి అనే విషయాన్ని గీత ద్వారా ఉపదేశించాడు. కర్తవ్యానికి ఎలాంటి హద్దులు, సమయం లేదని, వీటిని

అధిగమించాలని తెలియజెప్పాడు. తాను విశ్వమంతటా వ్యాపించి ఉన్నాను అనే విషయాన్ని శ్లోకాల ద్వారా తెలియచేశాడు.

ఇదే విషయాన్ని భాగవతం "త్వత్తో జ్ఞానం హి జీవానాం ప్రమోషస్ తే ఒత్ర శక్తితః (11.22.28) అని చెప్తుంది అంటే "నీ నుండే జీవప్రాణుల యొక్క జ్ఞానము ఉద్భవించినది, నీ శక్తి వలననే ఆ జ్ఞానము తీసివేయబడుతుంది" అని.

కాలస్వరూపుడై, సంవత్సర రూపంతో వెలుగొందేవాడు పరమాత్మ.
సమస్తమును లెక్కచూచేవాడు- కాలుడు. సర్వజీవుల చరాచరముల ఆయువును గణనం చేసే, కాలస్వరూపుడైన ఈశ్వరుడే 'కాలుడని' , ఆయననే 'కాలాయనమః' అన్నారంటారు ఆదిశంకరులు.
ఆద్యంతము విలువైన కాలము భగవంతుని స్వరూపమే. 'కాల' అంటే, 'కా' అనగా శుభములను, 'ల' అంటే అందించునది అని అర్థం. 'అహమేవ అక్షయ కాలః' అన్నది భగవద్వాక్యం. 'అక్షయమైన కాలాన్ని నేనే' అని చెప్పారు. పరమాత్మ. 'కాలః కలయతామహం' అన్నాడు అందుకే.

సూక్ష్మంగా చెప్పాలంటే త్రికాలాలకు అతీతుడిగా ఉంటూ, ప్రతీ ఒక్కరి భూత-భవష్యత్వ-వర్తమానాలు తెలిసి కూడా సాక్షీభూతుడిగా ఉండేవాడే భగవంతుడు. అటువంటి సర్వ నియామకుడు కాబట్టే బాబా వారు చాంద్ పాటిల్ కు తన తప్పిపోయిన గుఱ్ఱం విషయం చెప్పి సాంత్వన చేకూర్చారు.

ఈ అధ్యాయంలో మనం చూస్తే బాబావారు చాలా సాధారణ ఫకీర్ లా ఉంటూ, అందరికీ అందుబాటుగా ఉండేవారు. వారిని దరి చేరడానికి వేద విధులు కాక

కేవలం శ్రద్ధ - సబూరిలే ముఖ్య సాధనాలుగా ఉండేవి. యోగి అనేవాడు ఎలా ఉంటాడో శ్రీకృష్ణ స్వరూపంలో ఒకప్పుడు పలికి ఈ భావాన్నే సాయి మాతగా మనకు షిర్డీ బాబా రూపం లో చూపారు మన బాబా.

జ్ఞానవిజ్ఞాన తృప్తాత్మా
కూటస్థో విజితేంద్రియః ।
యుక్త ఇత్యుచ్యతే యోగీ
సమలోష్టాశ్మకాంచనః ।। గీత 6-8 !!

జ్ఞానము, విజ్ఞానవిచక్షణ కలిగి తృప్తి తో ఉన్న యోగులు, ఇంద్రియములను జయించిన వారై, అన్ని పరిస్థితులలో ప్రశాంతంగా ఉంటారు. వారు – మట్టి, రాళ్ళు మరియు బంగారము – వీటన్నిటిని ఒకే దృష్టి తో చూస్తారు.

జ్ఞానోదయమైన యోగి అన్ని వస్తువులను భగవత్ సంబంధంగా చూస్తాడు. భౌతిక శక్తి భగవంతునిదే కాబట్టి అన్ని వస్తువులు అతని సేవ కొరకే ఉన్నాయి అన్న భావంతో ఉంటారు అంటుంది సనాతనం. అది తన నడతలో బాబా వారు సూచిస్తూ ఎంతో గొప్ప విజ్ఞానాన్ని మనకు చెప్పకుండానే తెలియచేసారు. అటువంటి యోగి పుంగవుడి స్థితిని గ్రహించిన వాడు కాబట్టే జానకిదాసు సాయి బాబా వంటి మణి ఉండడం వల్లే షిర్డీ పుణ్య క్షేత్రం అయింది అన్నారు.

జానకి దాసుకి పై భావం తోస్తే మరి అక్కల్ కోట్ మహారాజు గారి శిష్యుడు అయిన ఆనందనాథ్ కు ఏమి తోచిందో చూద్దామా.

అభయం సత్త్వసంశుద్ధిః

జ్ఞానయోగవ్యవస్థితిః ।

దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయస్తప ఆర్జవమ్ ॥ గీత 16 -1 ॥

అహింసా సత్యమక్రోధః త్యాగః శాంతిరపైశునమ్ ।

దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీరచాపలమ్ ॥ గీత 16 - 2 ॥

తేజః క్షమా ధృతిః శౌచమద్రోహో నాతిమానితా ।

భవంతి సంపదం దైవీమభిజాతస్య భారత ॥ గీత 16 -3 ॥

శ్రీ భగవానుడు పలికెను : ఓ భరత వంశీయుడా, దైవీ సంపద కలవాని లక్షణములు ఇవి - నిర్భయత్వము, కల్మషం లేని మనస్సు, ఆధ్యాత్మిక జ్ఞానములో ధృఢసంకల్పము, దానము, ఇంద్రియ నిగ్రహము, యజ్ఞములను చేయుట, పవిత్ర గ్రంధ పఠనం, తపస్సు మరియు నిష్కాపట్యం; అహింస, సత్య సంధత, క్రోధము లేకుండుట, త్యాగము, శాంతి, ఇతరుల దోషములు వెతకకుండా ఉండుట, సర్వ ప్రాణులపట్ల దయ, దురాశ లేకుండుట, సౌమ్యత, అణుకువ మరియు నిశ్చలత్వము; బలము, క్షమాగుణము, మనఃస్థైర్యము, పరిశుభ్రత, ఎవరిపట్లా శత్రుత్వం లేకుండుట మరియు డాంభికము లేకుండుట.

ఇన్ని లక్షణాలను బాబా వారిలో దర్శించాడు కాబట్టే ఆనందనాధ్ బాబా వారిని ప్రస్తావిస్తూ “సాయి ఒక అమూల్యమైన రత్నం అని, అమూల్యమైన వజ్రం" అని వారు యౌవనము లో ఉన్నప్పుడే చెప్పేశారు.

బాబా వారి నిత్య కృత్యములు వివరిస్తూ అనుదినము కుమ్మరి నించి కాల్చని పచ్చి కుండలను తేవడం, వాట్లలో నీటిని తెచ్చి మొక్కలకు పోయడం, అవి కాల్చనివి కాకపోవడం తో అవి సాయంత్రానికి ముక్కలు కావడం చూస్తాము. ఈ దినచర్య మూడు మహామంత్రాల సారాన్ని చెప్తోంది అంటే నమ్ముతారా.

అవి తెలియాలి అంటే ముందు ఆ మహా మంత్రాలు ఏమిటో తెలియాలి. అవే తత్త్వమసి - అహం బ్రహ్మాస్మి - సర్వం ఖల్విదం బ్రహ్మ.

జీవాత్మ, పరమాత్మ అని మనం వేర్వేరుగా చెప్పుకొంటున్నా వాస్తవానికి ఆత్మ ఒక్కటే. జీవులందరిలో వున్న ఆత్మ ఒక్కటే అయినా మాయా (అజ్ఞాన) ప్రభావంతో వేర్వేరుగా తోస్తున్నది. ఎలాగైతే, ఒకే సూర్యుడు నీటి కుండలన్నింట్లోనూ వేర్వేరుగా కనిపిస్తున్నాడో అలాగే, ఆత్మ ఒక్కటే అయినా జీవుల రూపంలో వేర్వేరుగా కనిపిస్తుంటుంది.
ఈ జగత్తు అంతా పరమాత్మనుంచి పుట్టి, పోషితమై, మరల పరమాత్మలోనే లయమవుతున్నది. అందువల్ల, జగత్తు (ప్రపంచం) శాశ్వతం కాదు. ఆత్మయే శాశ్వతం. ఉన్నదికూడా ఆత్మ ఒక్కటే. ‘సర్వం ఖల్విదం బ్రహ్మ’. ఇదంతా బ్రహ్మమే (ఆత్మయే). ‘ఏకమేవా ద్వితీయం బ్రహ్మ’. ‘రెండవది లేని ఒకే బ్రహ్మం ఉన్నద’ని ఉపనిషత్తులు చెబుతున్నాయి.

ఈ ఆత్మ (బ్రహ్మం)కు సజాతీయ, విజాతీయ, స్వగత భేదాలేవీ లేవు. చరాచర జగత్తంతా వ్యాపించి ఉన్నది. అది ఏ విధంగానూ విభజితం కాలేదు. విభజితం అయినట్లుగా కనబడుతున్నది, అంతే.

‘తత్త్వమసి’ (అది నీవై ఉన్నావు), ‘అహం బ్రహ్మాస్మి’ (నేను బ్రహ్మమును) 'సర్వం ఖల్విదం బ్రహ్మ' (అంతా బ్రహ్మ పదార్థంతోనే తయారయింది) అన్న మహావాక్యాల నిరంతర చింతనలో తన ఆత్మ స్వరూపాన్ని తెలుసుకోవడమే అధ్యాత్మ విద్య. ఆత్మను గురించిన చింతనను, ఆత్మను తెలుసుకోవడమే జ్ఞానం. ఇదియే విద్య.

‘భగవద్గీత’ లో శ్రీ కృష్ణపరమాత్మ, ‘అధ్యాత్మ విద్యా విద్యానాం. విద్యలలో అధ్యాత్మ విద్యను నేను’ అన్నాడు. ఈ జ్ఞానాన్ని పొందడమే మానవజన్మ పరమలక్ష్యం.

సాయి బాబా వారి చర్య ద్వారా మనం తెలుసుకోవాల్సిన గొప్ప సత్యం ఏమిటంటే ఈ అనంత విశ్వం లోని ప్రతి జీవి ఉనికీ, అది సజీవమైనా, నిర్జీవమైనా, మనకు కనిపించేవి , కనబడనివి, మన ఊహ జనితమైనవి , ఊహాతీతమైనవి అన్నీ ఈ సర్వం ఖల్విదం బ్రహ్మ అనే ప్రాతిపదికలోనే నిక్షిప్తమై ఉన్నాయి. ఈ సృష్టిలోని ప్రతి ఒక్కటీ బ్రహ్మమేనని మన వేదాల్లో సుందరంగా చెప్పబడింది. అదే మనకు సూచనగా తెలియ చేస్తూ, ఈ సృష్టి అంటా ఈశ్వర జనితం అని, ఆది-అంతం ఉన్నదనీ; ఇందులో సుఖ దుఖాలు కేవలం అజ్ఞానజనితాలు అని; ఇదంతా అసత్య పదార్ధం అని సూచించడానికే అలా చూపారనుకోవాలి

అసత్య ప్రపంచం లో ఉంటూ అవిద్యలో నే మునిగి తేలుతూ, జ్ఞానానికి, సద్వస్తు వివేకానికి, వైరాగ్యానికి దూరంగా ఉన్న నాడు, జ్ఞానానికి గురువుని ఆశ్రయించని నాడు, ఈ జగత్తులో మనం కూడా పచ్చి కుండలా సమసి పోవడం తప్ప మరేమీ మిగలదని సూచించినట్లు అయింది.

అలా కాకుండా ఆత్మ పరమాత్మలో లయం కావాలి అంటే జ్ఞానాన్ని ప్రయత్న పూర్వకంగా సద్గురువు, సద్గ్రంధం, సత్సంగం, స్వాధ్యాయం ఇత్యాదుల ద్వారా ప్రయత్న పూర్వకం గా సాధించాలి. అప్పుడే మన జీవితం ఒక ముక్త స్థితికి చేరి జీవన్ముక్తిని సాధించ గలుగుతాము.

ఇక బాబా వారి పవిత్ర పాదుకా వృత్తాంతానికి వస్తే ఉపాసనీ బాబా వారు మార్పులు చేసి పాదుకల నమూనాలో పద్మము, శంఖము, చక్రము చేర్చారు అని హేమడ్ పంతు పేర్కొన్నాడు. ఈ ముద్రలు కుబేరుని నవ నిధులకు ప్రతీకలుగా చెప్పబడ్డాయి.

మహాపద్మశ్చ పద్మశ్చ శంఖో మకర కచ్ఛపౌ, ముకుంద కుందనీలాశ్చ ఖర్వశ్చ నిధయో నవ"

1. మహాపద్మము, 2. పద్మము 3. శంఖము 4. మకరము 5. కచ్ఛపము 6. ముకుందము
7. కుందము 8. నీలము 9. ఖర్వము అనేవి నవ నిధులుగా చెప్పబడ్డాయి.

బాబా పాదాలలోని ఈ ముద్రల ద్వారా నవనిధులే వారిని సేవిస్తున్నాయని, వారి కృపా కటాక్షం ఎవరిపై ప్రసరిస్తే వాళ్లకు అర్హతని బట్టి అన్నీ ఒసగుతారని అర్ధం అవుతోంది.

అలాగే ఈ అధ్యాయం ద్వారా మనకు బాబా వారు దినమంతా ధునికి ఎదురుగా గల కొయ్య చెట్టుపై తమ ఎడమ చేతిని ఆనించి కూర్చుని, ధునిలో

అహంకారాన్ని, కోరికలను, ఆలోచనలను ఆహుతి చేసి 'అల్లాహ్ మాలిక్' అంటూ పలుకుతూ ఉండేవారని చదువుకున్నాము. ఈ స్థితి ఒక స్తితప్రజ్ఞ భావాన్ని, ద్వంద్వాతీత స్థితిని, సమదృష్టి భావనను, సర్వ భూత దయను, నిష్కామ కర్మను, కర్మ సన్యాస స్థితిని, ఆత్మార్పణ భావాన్ని, ఆర్తత్రాణ పరాయణత్వాన్ని, ముక్త స్థితిని, పరమాత్మ తత్వాన్ని, ఇంకా ఎన్నో భాషకు అందని, అనుభవగ్రాహ్యం కాని భావాల్ని గోచరింపచేస్తాయి.

ఇలాంటి క్లిష్ట పదాలని అన్వేషించే అవసరం దూరం చేస్తూనే మన బాబా మనకి బోధల కన్నా, తమ యొక్క ఆచరణ లోనే మనం ఏ విధంగా చరించి తరించాలో చూపారు.

ఈ అధ్యాయము లో మొహియొద్దీన్ తంబోలీ కుస్తీ పడుతుండగా వైరాగ్యం కలగడం చూస్తాము. ఆ సమయం లో అశరీరవాణి ఆయనకు "దేహమును దమించి, దేవుని సహవాసము చేయుము" అని చెప్పడం చూస్తాము. చాల సూక్ష్మంగా వ్రాయబడిన ఈ స్థితిని అర్థం చేసుకోవాలంటే ఎంతో ఓపిక, సహనం, శ్రద్ధ కావాలి. ఈ వైరాగ్యం విషయం లో శంకరాచార్యుల వారు వివేక చూడామణిలో ఏమి చెప్పారో చూద్దాం.

ముందుగా ఈ స్థితి అర్థం చేసుకోవాడానికి నాలుగు సాధనలు చేయాలన్నారు :

1 నిత్యం, అనిత్యం - నిత్యం, అనిత్యం మధ్యన భేదం సులభంగా తోచుతుంది. కానీ, దాన్ని అనుసరించడం చాలా కష్టం. ఉదాహరణకు మనం ఒక కొత్త వస్తువు కొనగానే పగిలిపోతే మనకు చాలా బాధ కలుగుతుంది. మనకీ

తెలుసును, ఆ వస్తువు ఎప్పటికీ ఉండిపోయేది కాదు, ఎప్పుడో ఒకప్పుడు పోయేదేనని. కాకపోతే, తెలియడం వేఱు, దాన్ని జీర్ణించుకోవడం వేఱు. శంకరా చార్యులు చెప్తున్నది అది బుద్ధిలో పూర్తిగా జీర్ణించుకుపోవడం గురించి.

2. ఇహంలో, పరంలో భోగాలపై విరక్తి. - ఈ లోకమే కాదు, ఉన్నతలోకాలు కూడా శాశ్వతమైనవి కావు. మోక్షం మాత్రమే శాశ్వతమైన స్థితి. అందుకే పాపపుణ్యాలు రెండూ ముముక్షువుకు ప్రతిబంధకాలని శాస్త్రాలు చెప్తున్నది. అన్నమయ్య అన్నట్టు "భారపు పగ్గాలు, పాపపుణ్యములు".

ఒక రూపాయి దానం చేసిన వెంటనే మనసులో ఒక తృప్తి పుడుతుంది, "ఈ రోజు ఒక మంచి పని చేశాను", అని. అంటే ఆ దానానికి ప్రతిఫలం అప్పుడే అనుభవిస్తున్నాము. "నా డబ్బు నేను ఇంకొకడికి దానం చేసాను" అనుకుంటూ చేసిన దానం పుణ్యం అవుతుంది, మఱో జన్మలో మనకు వెనక్కొస్తుంది.
ఇది మంచి విషయంలా అనిపిస్తున్నా, ఆ పుణ్యం వెనక్కి రావాలి అంటే మనకు మఱో జన్మ ఉండాలి కదా? అందుకే దానం చేసేటప్పుడు, "ఇది నా ధర్మం. ఈ డబ్బు నాది కాదు.", అనే భావం ఉండాలని కృష్ణుడు భగవద్గీతలో చెప్పినది. "ఇది ఇవ్వడం నా ధర్మం" అని అనుకుని మనకు ఏ ఉపకారమూ చెయ్యని వాడికి, సరైన సమయంలో, సందర్భంలో ఇచ్చే దానమే సాత్త్వికమైన దానం.
3. వైరాగ్యం - ఇదే మొహియొద్దీన్ బాబా కరతలామలకం చేసుకున్న స్థితి.

దేహం మొదలుకొని బ్రహ్మం వరకు అనిత్యమైన వస్తువులందు "నాకు వద్దు" అనే భావం కలగడం వైరాగ్యం. మనిషికి అన్నిటికంటే సులువుగా లభించే

ఆనందాలు ఇంద్రియాలనుండి వస్తున్నాయి. చూడటం, వినడం, మాట్లాడటం, తినడం, వాసన, స్పర్శ -- ఇవే కదా వస్తువుల ద్వారా వస్తున్న ఆనందం. ఇవి కేవలం శరీరాన్ని సంతృప్తి పరచవచ్చును (తినడం), మనసుని సంతృప్తి కలిగించవచ్చును (ఇష్టమైనవారిని చూడటం), బుద్ధికి సంతృప్తిని కలిగించవచ్చును (కష్టమైన సమస్యను పరిష్కరించడంలో ఉన్న సంతృప్తి). ఇవేవీ శాశ్వతం కావు. అందుకే ఇది వద్దు, ఇది వద్దు అనే వదులుకుంటూ కేవలం శాశ్వతమైన (బ్రహ్మపదం) వాటిని కోరుకోవడమే వైరాగ్యం.

అది సాధించాక మొహియొద్దీన్ బాబా ఆత్మా సాక్షాత్కారనికి పాటుపడ్డారని చదువుతాము. ఆ సాధనలు ఏమిటో కూడా చూద్దాము.  ఆత్మ సాక్షాత్కారం అంటే తాను ఎవరో తెలుసుకుని, ఆ అసలైన తనతో రమించడమే అని ఇంతకుముందు గ్రహించాము.

అందుకు ముఖ్యంమైన శమదమాల లక్షణాలు (శమం, దమం, ఉపరతి, తితిక్ష, శ్రద్ధ, సమాధానం) ఇలా ఉన్నాయి.

1. శమం - మనసుకు (లౌకిక) విషయాలను చిన్నచూపుతో (ఇవి పనికిరావు అనే భావంతో) చూపిస్తూ ఎప్పుడూ లక్ష్యం (బ్రహ్మపదం) మీదనే మనసును ఉంచడాన్ని శమ అంటారు. (మనసుని అధీనంలో ఉంచుకోవడం).

2. దమం - రెండు రకాల ఇంద్రియాలు ఉంటాయి. కొన్ని విషయాలను తెలిపేవి (చెవులు, కళ్ళు మొ.), కొన్ని పనులు చేసేవి (చేతులు, కాళ్ళు మొ.). ఈ రెండింటినీ కూడా విషయాలనుండి దూరంగా తీసుకొచ్చి వాటి

కేంద్రబిందువులలో (అంటే చలించకుండా ఉండే స్థితికి) ఉంచడం దమం అంటారు.

3. ఉపరతి - బయటి విషయాలకు బుద్ధిని ప్రతిస్పందించకుండా ఉంచగలగడం ఉపరతి అంటారు.

4. తితీక్ష - అన్ని దుఃఖాలనూ అస్సలు బాధాపడకుండా, వాటి గురించి ఆలోచించకుండా సహనంతో ఓర్చుకోవడడం.

5. శ్రద్ధ - ఆత్మస్వరూపం తెలిపే శాస్త్రాలపై, గురువు మాటలపై సంపూర్ణమైన విశ్వాసంతో అవగాహన చేసుకోవడాన్ని శ్రద్ధ అని పెద్దలంటారు.

6. సమాధానం - ఎల్లప్పుడూ బుద్ధిని శుద్ధబ్రహ్మం పై ఉంచడాన్ని సమాధానం అంటారు. అంతే కానీ మనసుని లాలించుకోవడం (ఆలోచనలు లేకుండా ఉంచడం) సమాధానం కాదు.

అదే ముముక్షుత్వం. అదే ఆత్మ దర్శనం. అదే ముక్తి. అదే మాటలకు అందని స్థితి. ఈ స్థితి లో అహంకారం మొదలుకొని ఈ దేహం వరకు అన్నిటిపైనా అజ్ఞానం వలన మనం కల్పించుకున్న బంధాలు అని తెలుసుకుని, వాటిని తెంచుకునే సాధనే ముముక్షత్వం.
ఈ అధ్యాయంలో మనం బాబా వారు నూనె దుకాణాదారులు మసీదులో దీపాలు వెలిగించడానికి బాబా వారికి నూనె ఇవ్వకూడదని నిర్ణయించుకోవడం, అప్పుడు బాబా వారు రేకు డబ్బాలో నీళ్ళు పోసి, అవశేషాన్ని త్రాగేసి, మళ్ళీ

డబ్బాతో నీళ్ళు తీసుకుని ప్రమిదలలో నింపగా, అవి తెల్లరేదాకా వెలగడం చూస్తాము. ఇక్కడ మనం బాబా వారి సర్వ నియామకత్వాన్ని చూడవచ్చు.

ఇది శ్రీకృష్ణుల వారి గీత లో చూద్దాం.

అపరేయమితస్త్వన్యాం
ప్రకృతిం విద్ధి మే పరామ్ ।
జీవభూతాం మహాబాహో
యయేదం ధార్యతే జగత్ ॥ గీత 7 -5 ॥

అర్జునా, నాకు ఒక ఉన్నతమైన శక్తి ఉంది. అదే జీవ-ఆత్మ శక్తి, ఇది ఈ జగత్తు యందు ఉన్న జీవరాశులకు మూలాధారమైన జీవాత్మలను కలిగి ఉంటుంది.

బాబా వారు అలా చేయగలగడానికి కారణం ఏమిటంటే ఆయన సర్వ శక్తిమంతుడు. మాయ ఆయన అధీనంలో ఉండే శక్తి. అంతేకాక ఆయన సర్వవ్యాపి.

ఏక-దేశ-స్థితస్యాగ్నే:జ్యోత్స్నా విస్తారిణీ యథా పరస్య బ్రహ్మణో శక్తి: తథేదమ్ అఖిలం జగత్ అన్న విష్ణు పురాణం (1.22.5) లో తెలిపిన దాన్ని బట్టి "ఎలాగైతే సూర్యుడు ఒక చోటే ఉన్నా, కానీ, తన సూర్య కిరణములచే ఈ సౌర కుటుంబమంతా ఎలా వ్యాపిస్తాడో, అదే విధంగా ఒక్కడే భగవంతుడు, తన అనంతమైన శక్తులచే ఈ మూడు లోకాలలో వ్యాపించి ఉంటాడు."

మత్తః పరతరం నాన్యత్

కించిదస్తి ధనంజయ ।

మయి సర్వమిదం ప్రోతం

సూత్రే మణిగణా ఇవ ॥ గీత 7-7 ॥

నా కంటే ఉన్నతమైనది ఏదీ లేదు, ఓ అర్జునా. పూసలన్నీ దారము పై గుచ్చి ఉన్నట్టు సమస్తమూ నా యందే ఆధారపడి ఉన్నవి.

అప్పుడు కృష్ణ రూపం లో చెప్పింది ఇప్పుడు బాబా వారు ఈ అవతారం లో నిరూపించారు. అలా అన్నిటి మీద అజమాయిషీ ఉన్నందువల్లె మనం ముందు ముందు చదవబోయే ఉదంతాల లాగానే, ఇక్కడ కూడా వారి సర్వ నియామకత్వం మనకి ద్యోతకం అవుతోంది

ఇక నీళ్ళను నూనెలా మార్చిన విధం లో ఉన్న మహత్తు చూద్దాము.

రసోఽహమప్సు కౌంతేయ

ప్రభాస్మి శశిసూర్యయోః ।

ప్రణవః సర్వవేదేషు

శబ్దః ఖే పౌరుషం నృషు ॥ గీత 7-8 ॥

నీటి యందు రుచిని నేను, సూర్య చంద్రుల యొక్క తేజస్సుని నేను. వేదములలో నేను పవిత్ర 'ఓం' కారమును (ప్రణవము); ఆకాశములో శబ్దమును మరియు మనుష్యులలో వారి సామర్థ్యమును.

అలా ప్రకృతిలో లోని ఎనిమిది అంగాలలో తానే నిండి ఉన్న సాయిబ్రహ్మకు నీళ్ళను నూనెలా మార్చడం కష్టం కాదని అర్థం అవుతోంది కదా. మరి ప్రక్రుతి లో ఎనిమిది అంగాలు ఏమిటి అనుకుంటున్నారా. అవే ఈ ప్రక్రుతి తయారవడానికి ఉపకరణాలు. అవి లేకుండా ప్రక్రుతి రచింపబడదు.

ఆ ఎనిమిది తత్వాలు తానేఅని మనకు భగవానుడు శ్రీకృష్ణుడు గీత లో చెప్పాడు.

భూమిరాపోऽనలో వాయుః
ఖం మనో బుద్ధిరేవ చ ।
అహంకార ఇతీయం మే
భిన్నా ప్రకృతిరష్టధా ॥ గీత 7 - 4 ॥

భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి మరియు అహంకారము - ఇవి నా భౌతిక ప్రాకృతిక శక్తి యొక్క ఎనిమిది అంగములు.

సూక్ష్మంగా చెప్పాలంటే ఈ సృష్టి లో ఉన్నదంతా భగవంతుడి స్వరూపమే. ఆయన శక్తే ఇన్ని వివిధ రకాల ఆకారము, స్వరూపము మరియు పదార్థములుగా రూపాంతరం చెందింది.

అలా త్రాగిన నీళ్ళను నూనెగా మార్చి దీపాలు వెలిగించిన బాబా వారిని చూసి అంతకు ముందు నూనె ఇవ్వడానికి నిరాకరించైనా వర్తకులు పశ్చాతాపం తో

క్షమించమని వేడుకోవడం చూస్తాము. ఆ ఉదంతం చదివినప్పుడు ఒక బ్లాగ్ లో చదివిన కవిత గుర్తుస్తుంది.

దేహస్తాః సర్వవిద్యా శ్చ
దేహస్తా స్స ర్వదేవాతః!
దేహస్తాః సర్వతీర్థాని,
గురువాక్యేన లభ్యతే!!క
బ్రహ్మాండలక్షణం సర్వం, దేహమధ్యే వ్యవస్థితమ్.

దేహమే దేవాలయం; ఆత్మయే దైవం. దేహమే దేవాలయం; జీవుడే దేవుడు. ఈ దేహమే సమస్త బ్రహ్మాండాలకు ప్రతిరూపం దీని లోపల ఆత్మయే దైవం. మనస్సుకు పరిమితమైనవాడు జీవుడు మనో మూలంలోనికి వెళ్ళినవాడు దేవుడు. మనో మూలంలోనికి వెళ్ళినవారి దేహమే దేవాలయమౌతుంది. భగవంతున్ని చిత్రాలలో వెతకొద్దు చిత్తములో వెతకండి అని రమణమహర్షి అంటారు.

దీనిబట్టి మనకి తెలుస్తుందేమిటంటే భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. కానీ మనకి కానరావడం లేదు... ఎందుకనీ? మన మనస్సులో ఉన్న మాలిన్యాలు వలన! మనలో ఉన్న దేవుడు కనబడపోవడానికి ప్రధాన కారణాలు రెండే రెండు తలంపులు! మొదటిది 'నేను' అనే తలంపు ఇక రెండవది 'నాది' అన్న తలంపు. మొదటిది అహంకారం, రెండవది మమకారం! ఈ రెండు మాలిన్యాలు వదిలించుకుంటేనే జీవుడు దేవుడౌతాడు.

ఈ అధ్యాయంలో జౌహర్ అలీ  మరియు దేవీదాసు అనే కపట గురువుల గురించి చదువుతాము. వారివురు విషయంలోనూ బాబా వారు తన నించి వారికి విలువ ఇచ్చి, గురువుకు తగ్గ సింహాసనాన్ని ఇచ్చి, వారిని సేవించడం చూస్తాము. తరువాత వారి తప్పు వారే తెలుసుకుని  పశ్చాత్తాపపడడం లేదా పారిపోవడం అన్నది చూస్తాము.

ఇక్కడ మనకి ద్యోతకం అయ్యేది సర్వభూత దయ,ద్వందాతీత భావం, అందరిలో తనను, తనలో అందరినీ చూసుకునే తత్వం చూస్తాము. ఇదే స్థితో చూద్దామా!

జితాత్మనః ప్రశాంతస్య
పరమాత్మా సమాహితః ।
శీతోష్ణసుఖదుఃఖేషు
తథా మానాపమానయోః ॥ గీత 6-7 ॥

మనస్సుని జయించిన యోగులు - శీతోష్ణములు, సుఖదుఃఖములు, మానాపమానములు - ఈ ద్వందములకు అతీతంగా ఉన్నతమైన స్థానంలో ఉంటారు. ఇటువంటి యోగులు ప్రశాంతతతో, స్థిర చిత్తముతో ఉంటారు.

మనః ఏవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయో: "మనస్సు" అనేటటు వంటిది శుభ వాసనలతోనూ లేదా  స్వార్ధభరిత మైన కోరికలతోనూ ఉంటుంది. స్వార్థభరిత కోరికలు స్వార్థాన్ని తృప్తిపరిచేట్టుగా వుండి పతనానికి దారి

తీస్తాయి. ఎప్పుడైతే మన కర్మలు ఒక కోరికను తీర్చుకునే ఉద్దేశ్యంతో చేయబడతాయో, ఆ కర్మ యొక్క మంచి-చెడు ఫలితాలు మన రాబోయే జన్మలో భోగించడానికి కారకాలు అవుతాయి. అంటే మోక్షం కు దూరం చేస్తాయి అన్న మాట. అందువల్లే మనసు అనేది మోక్షానికి ప్రతిబంధకం అని తెలుస్తోంది.

అటువంటి మనసుని నిగ్రహించి, పొగడ్తలు-అవమానాలు రెండిటినీ ఒకేలా చూస్తూ, మిత్రులు - శత్రువులు అన్న బేధం లేకుండా, అందరినీ ఒకేలా చూడగలిగే సమ దృష్టి ఎంతో అభ్యాసంతో గాని కరతలామలకం కాదు. ఈ విషయం లో కృష్ణ సాయి చెప్పింది చూద్దాం.

విద్యావినయసంపన్నే
బ్రాహ్మణే గవి హస్తిని ।
శుని చైవ శ్వపాకే చ
పండితాః సమదర్శినః ।। గీత 5-18

నిజమైన పండితులు, దివ్య జ్ఞాన చక్షువులతో - ఓ బ్రాహ్మణుడిని, ఓ ఆవుని, ఓ ఏనుగుని, ఓ కుక్కని, ఓ చండాలుడిని సమ-దృష్టితో చూస్తారు.

ఇదే జరిగింది పైన నుడివిన ఇద్దరు కపట గురువుల విషయంలో. బాబా గారు సర్వజ్ఞులు. అయినా వారిని అవమాన పరచక, తన పాండిత్యాన్ని, గొప్ప తనాన్ని బయటపెట్టక, యద్భావం తద్భవతి అన్న చందాన, వారు తనను శిష్యుడిగా ఎంచి శాసిస్తుంటే, దానికి ఎదురు చెప్పక, తన నడవడిక లో పైన చెప్పిన గొప్ప భావాలను ఆచరించి చూపారు. ఈ మార్గదర్శకత్వం వారికేమన్నా తెచ్చి పెట్టిందా. లేదు. అది కేవలం మనకు ఎలా మెలగాలో చూపేందుకు. ఈ

లోకం, కీర్తి, శరీరం, అందం, ఆర్భాటం, ఐశ్వర్యం, పేరు, ప్రతిష్ఠ, దర్పం, మంది, మార్బలం, పనివారు, భోగం, అధికారం ఇత్యాదులన్నీ అశాశ్వతాలు అని, వీటికి పరమోత్కృష్ట హృదయంలో ఎటువంటి విలువ లేదని, మనిషి ఎప్పుడూ పరమోన్నత స్థానమైన ఆ భగవత్ కైకర్యాన్ని, ఆత్మ – పరమాత్మల ఐక్యాన్ని కోరుకోవాలని మనకు 'అల్లాహ్ మాలిక్' అంటూ ఎప్పుడూ దానిస్తూ కనిపించి బోధించారు.

వారు కేవలం బోధ గురువులుగా కాక, శిష్యులు ఎలా గురుపథాన్ని పొందవచ్చో తమ జీవన పైనం లో చూపారు. ఇదే భావం కృష్ణ బోధలో ఎలా వ్యక్తీకరించారో చూద్దాం.

యం హి న వ్యథయంత్యేతే

పురుషం పురుషర్షభ ।

సమదుఃఖసుఖం ధీరం

సోఽమృతత్వాయ కల్పతే ॥ గీత 2-15 ॥

ఓ అర్జునా! పురుష శ్రేష్ఠుడా! సుఖదుఃఖములచే ప్రభావితం కాకుండా, రెండిటిలో చలించకుండా నిశ్చలముగా ఉన్నవాడు మోక్షమునకు అర్హుడవుతాడు.

ఇది బోధలా చెప్తే శిష్యుడికి అర్థం అయినట్లు ఉండి.. విన్న కొద్ది సేపు ఒక ఉన్నత స్థితిలో ఉండి, ఎప్పుడైతే సంసారంలో పడతాడో దాని ఉనికి, ఆ ఉత్కృష్ట భావన యొక్క గరిమని కనీసం తెలుసుకునే ప్రయత్నం కూడా చెయ్యకుండానే జీవితాన్ని వెళ్ళబుచ్చేస్తాడు. అంతేకాక ఈ విషయం తెలియాలి అంటే ఎంతో

కొంత శాస్త్ర విజ్ఞానం, అందుకు తగినంత ప్రయత్నం ఉంటే గాని, కనీసం విషయం తెలుసుకునే అవకాశం కూడా లేకుడానే జీవితం వెళ్ళబుచ్చేయచ్చు.

అటువంటి గొప్ప జ్ఞానాన్ని కేవలం తన ఆచరణలో చూపి, ఒక తల్లి.. రోగంతో బాధ పడుతున్న బుడుతడికి, ఏ విధంగా మందును అనునయ వాక్యాలతోనో, పొత్తిళ్ళలో తీసుకునో, ఎలాగో అలాగ ఏమరుపరచి మందు ఇచ్చి, ఆ వచ్చిన రుగ్మత తగ్గేందుకు ప్రయత్నం చేస్తుందో, అదే మాత్రు భావం తో మన సాయిమాత, మన భవరోగాన్ని దూరం చేయగల జ్ఞాన ఔషధాన్ని, ఇంత గొప్ప జ్ఞానాన్ని మనతో పానం చేయిస్తున్నారు అని కూడా తెలియనీయకుండా అందించారు.

ఇక్కడ ఒక విషయం చెప్పాలి. ఎక్కడా మనం ఏ ఉదంతం లోనూ, లేదా సచ్చరిత్ర లోనూ బాబా వారిని ఇప్పుడు మనం ఆపాదిస్తున్న బంగారు ఆసనం, కిరీటం, నగిషీలు, వెండి శాలువాలు లేదా గొప్ప సింహాసనం పైన చూడము. సాయి తత్త్వం మనకు బోధించింది ఆడంబరాలకి, అతి డాంభికాలకు దూరంగా ఉండమని, మనస్సుని ఉన్నతం గా ఉంచుకోమని. కానీ ఈ రోజుల్లో మనం సంస్థానం నడిపే ఎందరిలోనో ఆయా సంస్థానాలతో సంబంధం ఏదో ఒక గొప్ప ఆభూషణంగా మారి, వారి మాట, వారు నడవడికని కూడా సాయి తత్వానికి విరుద్ధంగా మారుస్తోంది.

సుఖదుఃఖములచే ప్రభావితం కాకుండా, భగవద్ధ్యానంలో మనసుని ఉంచమని మనకి మన సాయి బోధిచారని గ్రహించే జ్ఞానం వారికి ప్రసాదించమని బాబా ని కోరుతూ ......

ఈ అధ్యాయం ముగింపు లో గురువు శిష్యుడిని ఎలాగ సేవించాలో, ఏ విధంగా ఆత్మ సాక్షాత్కారాన్ని పొందవచ్చో బాబా వారు ఆచరణాత్మకం గా బోధించారు అని చెప్పబడింది. అది అర్థం కావాలి అంటే ఆత్మసాక్షాత్కారం అంటే ఏమిటో తెలియాలి కదా.

అహమి నాశభాజ్యహ మహం తయా!
స్ఫురతి హృత్ స్వయం పరమపూర్ణ సత్!

'అహం అనే భావన నాశనమైపోయినప్పుడు శ్రేష్ఠం, అఖండం అయిన సత్ స్వరూపం 'నేను, నేను' అంటూ హృదయంలో స్వయంగా ప్రకాశిస్తుంది' అని ఈ శ్లోక భావం. భగవాన్ రమణ మహర్షి రచించిన 31 శ్లోకాల ఆత్మజ్ఞాన గ్రంథం.. 'ఉపదేశ సారం' లోని 20వ శ్లోకమిది.

మనో నాశనం కావాలంటే 'నేను' అనే భావన తొలగిపోవాలని తెలిపిన రమణులు.. ఆ భావన పోయాక మిగిలి ఉండే స్థితి గురించి ఇందులో వర్ణించారు. అహం భావన పడిపోయాక మిగిలే 'నేను' .. సత్యమైనది. అది జ్ఞాన స్వరూపం. సత్ రూపం. అఖండం, పరిపూర్ణం అయిన శాశ్వత వస్తువు. ఈ 'నేను' నే రమణ మహర్షి 'తాను' అని వ్యవహరించేవారు. మనం సుషుప్తిలో ఉన్నప్పుడు అన్ని భావనలు, మనస్సు అంతమైనా కూడా ప్రకాశిస్తూ ఉండేది ఇదే. కాకపోతే మనస్సు ఆ 'నేను' లో లయమైందే తప్ప నశించలేదు కనుక.. మెలకువ రాగానే మళ్లీ మనసు, దాంతోపాటు ఈ జగత్తు, సుఖదుఃఖాలు అన్నీ

పుట్టుకొస్తున్నాయి. ప్రయత్న పూర్వకంగా, విచారణతో 'అహం' భావనను నాశనం చేస్తే ఆ స్థానంలో తాను (ఆత్మ) 'నేను నేను' అని స్వయంగా ప్రకాశిస్తుంది. అదే ఆత్మసాక్షాత్కారం. ఆత్మ దర్శనం.

ఆత్మదర్శనం కేవలం విచారణ వల్ల మాత్రమే కలుగుతుంది. పూజ, యజ్ఞం, దానధర్మాలు మొదలైన కర్మల వల్లగానీ, జపం, ధ్యానం మొదలైన సాధనల వల్లగానీ, ప్రాణాయామం మొదలైన ప్రక్రియల వల్ల గాని ఈ 'అహం' భావన తొలగిపోదు. ఈ సాధనలన్నీ కొన్ని ప్రక్రియలు మాత్రమే. 'అహం' పుట్టుక ఎక్కడో వెతకడం (విచారణ) వల్లనే అది పడిపోతుంది. అప్పుడే ఆత్మదర్శనం. దానికి మరో పద్ధతి సాధకుడు సాధన చతుష్టయ సంపన్నుడై తగిన శ్రద్ధ చూపిస్తే సద్గురువు ద్వారా వేదాంత బోధ వింటూ ఉండగానే అతడికి ఈ స్థితి సద్యోఫలంగా లభిస్తుంది. ఇదే మనకు ఆచరణలో బాబా వారు చూపించారు. మనకు బోధల ద్వారానో లేదా పెద్ద పెద్ద గ్రంధాలు గాని తిరగేసి తెలుసుకోవాల్సిన అవసరం లేకుండా తానె మనకి ఆచరణ లో చూపారు. స్వయానా తానె భగవత్ స్వరూపుడు అయినప్పటికీ ఒక శిష్యుడు గురువు దగ్గర ఎలా మెలగాలో ప్రతీ దర్శనం లో మనకి చూపారు. మరింతగా విషాదం కావాలి అంటే గీత లోని రెండు శ్లోకాలు చూద్దాము.

అర్జున ఉవాచ ।

కైర్లింగైః త్రీన్ గుణానేతాన్

అతీతో భవతి ప్రభో ।

కిమాచారః కథం చైతాన్

త్రీన్ గుణానతివర్తతే ॥ 21 ॥

అర్జునుడు ఇలా అడిగాడు: ప్రకృతి త్రి-గుణములకు అతీతముగా అయినవాడి లక్షణములు ఏ విధంగా ఉంటాయి, ఓ ప్రభూ? వారు ఏవిధంగా ప్రవర్తిస్తారు? వారు త్రి-గుణముల బంధనమునకు అతీతముగా ఎలా అవుతారు?

అర్జునుడు శ్రీ కృష్ణుడి నుండి త్రి-గుణములకు అతీతులవటం గురించి విని ఉన్నాడు. అందుకే, ఇప్పుడు ఈ త్రి-గుణముల  విషయమై మూడు ప్రశ్నలను అడుగుతున్నాడు. 'లింగైః' అంటే 'లక్షణములు' అని అర్థం. అతని మొదటి ప్రశ్న ఏమిటంటే, "మూడు గుణములకు అతీతముగా ఉండేవాని లక్షణములు ఎలా ఉంటాయి?" 'ఆచారః' అంటే 'ప్రవర్తన' అని అర్థం. అర్జునుడి రెండవ ప్రశ్న ఏమిటంటే: “ఏ విధంగా ఈ త్రిగుణాతీతులు ప్రవర్తిస్తూ ఉంటారు?”. 'అతివర్తతే' అంటే 'అతీతులైపోవటం'. మూడవ ప్రశ్న ఏమిటంటే: "ఈ త్రి-గుణములకు అతీతులము కావటం ఎలా?" శ్రీ కృష్ణుడు అతని ప్రశ్నలకు పద్ధతిప్రకారం సమాధానం చెప్తున్నాడు.

యే హి సంస్పర్శజా భోగా దుఃఖయోనయ ఏవ తే ।
ఆద్యంతవంతః కౌంతేయ న తేషు రమతే బుధః ।। 22

ఇంద్రియ వస్తు-విషయ సంపర్కం వలన కలిగే భోగాలు, ప్రాపంచిక మనస్తత్వం ఉన్నవారికి ఆనందదాయకంగా అనిపించినా, అవి యథార్థముగా దుఃఖ హేతువులే. ఓ కుంతీ పుత్రుడా, ఇటువంటి సుఖాలకు ఒక ఆది-అంతం (మొదలు-చివర) ఉంటాయి, కాబట్టి జ్ఞానులు వీటి యందు రమించరు. వస్తు-విషయ సంపర్కం చే ఇంద్రియాలు సుఖాన్ని కలుగ చెస్తాయి. మనస్సు ఒక ఆరవ ఇంద్రియము లాగా, గౌరవము, పొగడ్త, పరిస్థితులు, విజయము

మొదలైన వాటి నుండి ఆనందాన్ని ఆస్వాదిస్తుంది. ఈ యొక్క శారీరిక, మానసిక సుఖాలనే భోగాలు అంటాము. ఇటువంటి ప్రాపంచిక భోగాలు, ఈ క్రింది కారణాల వలన ఆత్మ ను సంతృప్తి పరచలేవు.

1. ప్రాపంచిక ఆనందాలు పరిమితమైనవి, కాబట్టి ఏదో లోపించిన భావన వాటిలో అంతర్గతంగా ఉంటుంది. ఒక వ్యక్తి కి లక్షాధికారి అయ్యాననే సంతోషం ఉండవచ్చు, కానీ అదే లక్షాధికారి ఒక కోటీశ్వరున్ని చూసినప్పుడు అసంతృప్తికి లోనై ఇలా అనుకుంటాడు "నాకు కూడా ఒక కోటి రూపాయలు ఉంటే నేను కూడా సంతోషంగా ఉండేవాడిని."

దీనికి విరుద్ధంగా, భగవద్ ఆనందం అనంత సంతృప్తిని ఇస్తుంది.

2. ప్రాపంచిక సుఖాలు తాత్కాలికమైనవి. ఒకసారి అయిపోయిన తరువాత, వ్యక్తిని మరల అసంతృప్తి తో వదిలిపెడతాయి. ఉదాహరణగా మద్యం, సిగరెట్ వగైరాలు. ఒకసారితో  కాక  మరలా కావాల్సిన భావన. కానీ, భగవంతుని ఆనందం నిత్యమైనది, ఒకసారి పొందిన తరువాత అది ఎప్పటికీ ఉంటుంది.

3. ప్రాపంచిక సుఖాలు జడమైనవి, కాబట్టి క్రమక్రమంగా తగ్గిపోతాయి. భౌతిక వస్తువుల నుండి కలిగే సుఖం మనం దానిని ఆనందించే కొద్దీ తగ్గిపోతుంది. కానీ, భగవంతుని ఆనందం చైతన్యవంత మైనది; అది సత్-చిత్-ఆనందం (శాశ్వతమైన నిత్య నూతనమైన దివ్య ఆనందము). కాబట్టి, ఒక వ్యక్తి అదే భగవత్ నామాన్ని నిరంతరం రోజంతా జపిస్తూ ఉన్నా, నిత్య నూతన మైన ఆధ్యాత్మిక తృప్తిని దానిలో పొందుతాడు.

చివరిగా ఒక వ్యక్తి దివ్య ఆధ్యాత్మిక ఆనందాన్ని అస్వాదిస్తున్నప్పుడు, మనస్సు వేరే సుఖాలపై రుచిని కోల్పోతుంది. విచక్షణా జ్ఞానం ప్రసాదించబడిన వారు ఈ పైన చెప్పబడిన భౌతిక సుఖాల లోపాలను అవగతం చేసుకుని, తమ ఇంద్రియములను వాటి నుండి నిగ్రహిస్తారు. ఈ విషయాలని ఒక బోధలా కాక మనకు తానూ ప్రయత్న పూర్వకంగా చాల సీదాసాదాగా ఉంటూ, పండితులను పామరులను ఒకేలా చూస్తూ, ప్రాపంచిక ఆర్భాటాలకు దూరంగా ఉంటూ, మన ఆలోచనలని, కుసంస్కారాలని, మన కర్మలను జ్ఞానాగ్ని (ధుని) లో దగ్ధం చేస్తూ, ఎల్లప్పుడు భగవన్నామం తలుచుకుంటూ తరించమని, దానికి ముఖ్యంగా అహంను వీడి, గురు వాక్యం పై శ్రద్ధ వహిస్తూ, ఓపిక తో కొనసాగించమని పదే పదే బోధించారు.
దీనితో అయిదవ అధ్యాయ తత్త్వ బోధ పూర్తి అవుతోంది.

6వ అధ్యాయ ప్రారంభం లో గురు కర స్పర్శ మహిమను చెప్తూ "ప్రళయాగ్నిచే కూడా కాలనట్టి వాసనామయమైన సూక్ష్మ శరీరము కూడా గురుకర స్పర్శ చే భస్మమై పోతుంది. అనేక జన్మార్చిత పాప సంచయం కూడా పటాపంచెలు అవుతాయి. ఆధ్యాత్మిక సంబంధ విషయాలు వినడం వల్ల వారి వాక్కు నెమ్మదిస్తుంది" అని చెప్పబడింది. ఇదే కాక ఇంకా ఎన్నో అనుభవాలు ఇందులో పేర్కొన బడ్డాయి. అవి చూద్దాము.

ముందుగా అసలు ఈ సూక్ష్మ శరీరం అంటే ఏమిటో చూద్దాం. ఈ ప్రపంచమంతా పంచభూతాత్మకం. మన శరీరం కూడా పృథివ్యాపస్తేజో వాయురాకాశాత్'..అంటే భూమి, నీరు, అగ్ని, వాయువు, ఆకాశం అనే పంచభూతాలతో నిర్మితమైనదే.

పైకి కనిపించేదంతా స్థూల శరీరం. స్థూల శరీరంలో సూక్ష్మ శరీరం, కారణ శరీరాలున్నాయి. ఎముకలు, మూలగ, రక్తనాళాలు, మాంసం, రక్తం, చర్మం అనే అనే ఆరు పదార్థాలతో ఏర్పడింది స్థూల శరీరం. తల, కాళ్లు, చేతులు, వెన్ను, మస్తకం అనే అవయవాలతో మలమూత్ర సహితమై, 'నేను' , 'నాది' అనే అహంకారంతో కూడుకున్నదే స్థూలశరీరం.

ఇక మనసు, బుద్ధి, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, సూక్ష్మ పంచభూతాలు కలిసి మొత్తం పదిహేడు తత్వాలతో ఏర్పడింది సూక్ష్మ శరీరం. జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలంటే స్థూల శరీరంలో బయటకు కనిపించే కళ్లు, చెవులు, కాళ్లు, చేతులు కాదు. అవి ఆ ఇంద్రియాలకు చెందిన బాహ్యోపకరణాలు. ఈ ఉపకరణాల ద్వారా విషయాలు ఇంద్రియాలకు చేరతాయి. ఉదాహరణకు బయటకు కనిపించే కన్నులో నేత్రేంద్రియం లేదు. నేత్రేంద్రియం మెదడులోని నాడీ కేంద్రంలో ఉంటుంది. ఇతర ఇంద్రియాల విషయం కూడా ఇంతే.

ఇంద్రియాలన్నీ శరీరంలోని నాడీ మండలంలో ఉంటాయి. కన్ను ద్వారా దృశ్యం నేత్రేంద్రియానికి చేరుతుంది. సూక్ష్మ పంచ భూతాలంటే శబ్ద స్పర్శ రూప రస గంధాదులు. వీటినే విషయాలు లేదా పంచ తన్మాత్రలు అంటారు. ఇంద్రియాల ద్వారా విషయాలు మనసుకు చేరుతాయి. మనసు బుద్ధికి అందజేస్తుంది. బుద్ధి నుండి జీవుడు గ్రహిస్తాడు. అప్పుడు చేయవలసిన పనికి కర్మేంద్రియాలను నియమిస్తాడు.

స్థూల శరీరాన్ని తేజోమయం చేస్తున్నది సూక్ష్మ శరీరమే. సూక్ష్మ శరీరానికి ఆధారం ఆత్మ. కాబట్టి సూక్ష్మ శరీరం లేకుండా స్థూల శరీరం ఎందుకూ

పనికిరాదు. స్థూల శరీరం సూక్ష్మ శరీరంతో కలిసి విధులు నిర్వర్తిస్తున్నది. ఈ శరీరమే ఆత్మజ్ఞానం పొందడానికి అనువైనది.

జీవుడు శరీరాన్ని వదిలి పెట్టేటప్పుడు సూక్ష్మ శరీరంతో కూడి బయటకు వెళ్తాడు. అప్పుడు స్థూల శరీరం నిర్జీవమవుతుంది. శరీరాన్ని వదిలే ముందు వాక్కు మనస్సులో లీనమౌతుంది. చక్షురాది ఇంద్రియాలన్నీ మనస్సును చేరుతాయి. ఇంద్రియాలతో కూడిన మనస్సు ప్రాణంలో లీనమవుతుంది. ప్రాణం ఆత్మలో లీనమౌతుంది. ఈ విధంగా సూక్ష్మ శరీరం దేహాన్ని విడిచి ఆత్మను చేరి ఉంటుంది.

మృత్యుకాలంలో జీవుడు సూక్ష్మ శరీరంతో పాటు చేసిన కర్మలతో కూడి దేహాన్ని వదలిపోతాడు. సూక్ష్మ శరీరం జీవునికి వాహకమవుతుంది. తదుపరి అది మరో స్థూల శరీరానికి కారణమవుతుంది కాబట్టి దానిని కారణ శరీరమంటారు. సూక్ష్మంగా చెప్పాలంటే మన గత జన్మల పాప, పుణ్యాల ఫలితాలు, మునుపటి జీవితాల సంస్కారాలతో కూడి ఉన్న శరీరమే సూక్ష్మ శరీరం.

అంటే ఈ సూక్ష్మ శరీరం తన గత జన్మల యొక్క కోరికలు, సాధనాలు, అలవాట్లు, భావ పరంపర నిబిడీకృతం అయి ఉంటుంది అన్నది తెలుస్తూనే ఉంటుంది. అదే భావలహరి ఆ సూక్ష్మ శరీరం దీనిని ఉపాధిగా తీసుకుని మళ్ళీ జన్మ పొందుతుందో ఆ జీవికి ఆలవాలం అవుతాయి. అటువంటి జన్మ జన్మల సంస్కారాలు ఆమోద యోగ్యం అయితే, కుసంస్కారాలు హర్షింప తగ్గవి కాదు. అటువంటి కుసంస్కారాలు కూడా సర్వజ్ఞత పొందిన మహా పురుషులు, లేదా గురువర్యుల చేతి స్పర్శతోనే దహింప బడి, మరుజన్మ కు కారణాలు కావు అని తెలుస్తోంది.

అలాగే ఇంతకు ముందు మనం సంచితం, ఆగామి, ప్రారబ్ధం గురించి చాలా విశదం గా తెలుసుకున్నాం. అందువల్ల ఇందులో ప్రస్తావించిన సంచితం గురించే సూక్ష్మంగా చూద్దాము. ఇంతకు ముందు జన్మలో చేసి, తర్వాతెప్పుడో ఫలితం ఇవ్వడానికి కూడబెట్టబడిన కర్మలలో నుండి ఆ జన్మలో ఎప్పుడో ఒకప్పుడు ఫలితాన్నిచ్చి శాంతించినవి పోను, మిగిలినకూడబెట్టబడిన కర్మలను, అదేవిదంగా అంతకుముందు జన్మలలో చేసిన కర్మఫలం నుండి ఖర్చు అయినవిపోగా ఒక జన్మనుండి మరొక జన్మకు మోసుకుంటే వచ్చిన కర్మలను సంచిత కర్మలు అంటారు.

జీవుడు శరీరాన్ని వదిలిపెట్టినా, ఈ సంచిత కర్మలు మాత్రం జీవున్ని విడిచి పెట్టకుండా అతడితో ప్రయాణమై వస్తుంటాయి. మనం అద్దె ఇళ్ళలో వుండి, మరొక ఇంటికి మారేటప్పుడు ఆ ఇంటిలో ఉన్న వస్తువులను ఎలా మూటగట్టుకొని తీసుక వెళతామో అలాగే జీవుడు భగవంతుడు ఇచ్చిన అద్దె ఇంటిలాంటి ఈ శరీరాన్ని విడిచి వెళ్ళేటప్పుడు ఆ శరీరంలో ఉన్నప్పుడు సంపాదించిన, కర్మఫలాలను మూటగట్టుకొని తగిన మరొక అద్దెకొంపలాంటి శరీరాన్ని వెతుక్కుంటూ వెళతాడు. ఇలా తీసుకువెళ్ళేవే 'సంచిత కర్మలు'. ఇలా మరు జ జన్మకు కారణం అయ్యే సంచితము ను కూడా గురుకర స్పర్శ దహింపచేసి మళ్ళీ జన్మ లేకుండా చేస్తుంది అని చెప్పబడింది. (జక్కని వేంకటరాజం గారి వ్యాసం నించి కొంత విషయం తీసుకోవడం జరిగింది).

ఐదవ ఆధ్యాయం సంపూర్ణం.